రైతుబజారు కళకళ

- రోజుకు 3 వేల మందికిపైగా వినియోగదారుల రాక
- నిర్ణీత ధరలకే కూరగాయల విక్రయం
- ఇతర నిత్యావసరాలూ లభ్యం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



విక్రయాలకు సిద్ధంగా ఉన్న తాజా కూరగాయలు

కంచరపాలెం: ఊర్వశి కూడలి సమీపంలోని కంచరపాలెం రైతుబజార్ నిత్యం వినియోగదారులతో కళకళలాడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే రైతుబజారుకు వినియోగదారుల తాకిడి పెరుగుతోంది. జీవీఎంసీ 54వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన రైతుబజారుకు జీవీఎంసీ 46,47,48,49, 54, 55, 56,57 వార్డులు ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులు ప్రతి రోజూ 3 వేలకు పైగానే వస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలతో పాటు, ఇతర నిత్యావసర సరకులు సైతం విక్రయిస్తుంటారు. రైతులతో పాటు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, పండ్లు, పూలు, గిరిజన, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే సరుకులు విక్రయిస్తున్నారు.

సంకల్పం గొప్పది....

నగర వాసులకు చెంతనే కూరగాయలు, నిత్యావసర సరకులు నిర్ణీత ధరలకు, డిమాండ్ సమయంలో ఉల్లిపాయలు, టమాటా సబ్సిడీ ధరలకు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. కంచరపాలెం రైతుబజారు నిర్వహణ ద్వారా సుమారు రూ.1.95లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతుబజార్ ఎస్టేట్ అధికారి (ఈవో) అటెండర్, స్కావెంజర్లు వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోనూ ప్రభుత్వానికి పెద్దగా మిగిలేది ఏమీ ఉండదు. బయట మార్కెట్లో కృత్రిమ కొరత, ధరల దోపిడీ వంటి చర్యలతో ఆర్థిక భారం లేకుండా వినియోగదారులకు మేలు చేయాలనే సంకల్పంతోనే ఇక్కడి రైతుబజారు నిర్వహిస్తున్నారు.

నేరుగా రైతులే వ్యాపారులు....

కంచరపాలెం రైతుబజారులో 189 మంది రైతులు అధికారికంగా ఉన్నారు. వీరిలో సుమారు 155 మందికి పైగా రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గుర్తింపు పొందిన రైతులు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. వారు పండించిన పంటను బజార్‌కు తీసుకొచ్చి నేరుగా వారే వినియోగదారులకు విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, సరైన తూకంతో కూడిన కూరగాయలు అందేలా మార్కెటింగ్ శాఖాధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. చక్కటి పార్కింగ్‌తో వినియోగదారుల రాకపోకలు చేసేందుకు వీలుగా రైతుబజారుకు రెండు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు.

రైతుబజారు విస్తీర్ణం	:	రెండెకరాలు..
నిర్వహణ సమయాలు	:	రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం12.30 వరకు సాయంత్రం 4 -7 గంటల వరకు
మొత్తం స్టాల్స్	:	114
రైతుల సంఖ్య	:	189
ఉదయం వచ్చే రైతుల సంఖ్య	:	114
సాయంత్రం వచ్చే రైతుల సంఖ్య	:	61
సమాచారం కోసం	:	శెట్టి కృష్ణమూర్తి, ఎస్టేట్ అధికారి
సెల్ నంబర్	:	89197-79799

ప్రతి మంగళవారం రైతుబజార్ సెలవు..

పార్కింగ్ సమస్య లేకుండా చూడాలి



ఉదయం, సాయంత్రం వేళల్లో రైతుబజారులో తాజా కూరగాయలు మార్కెట్ శాఖాధికారులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రైతు బజార్ అందుబాటులో ఉండడం వినియోగదారులకు ఎంతో వెసులుబాటు. అయితే ప్రధాన ద్వారం వద్ద ప్రైవేటు వ్యక్తులు విక్రయాలతో పార్కింగ్ సమస్య ఇబ్బందిగా మారుతోంది.

–కొయ్య కుంచమ్మ, వినియోగదారు, గొల్లకంచరపాలెం

దళారుల బెడద తప్పింది



రైతుబజారులో రైతులకు గుర్తింపు కార్డు ఇస్తున్నారు. మా పొలంలో పండించిన పంట మేమే రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. అన్ని ఖర్చులు పోనూ రోజుకు సుమారు రూ. 600లకు పైగానే మిగులుతోంది. గతంలో దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి బాధ తప్పింది. రైతుబజారుకు వినియోగదారుల సంఖ్య పెరగడంతో లాభాలతో ఇంటికి వెళుతున్నాం. రైతుబజార్‌లో ఏర్పాట్లు కూడా బాగున్నాయి.

–బుజ్జమ్మ, రైతు, కంచరపాలెం రైతుబజారు

సౌకర్యాలు కల్పిస్తున్నాం



రైతుబజార్‌లో వినియోగదారుల అవసరాల మేరకు కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రైతుబజార్ నిర్వహణ చేపడుతున్నాం. నిర్ణయించిన ధరలకే కూరగాయలు విక్రయించేలా చూస్తున్నాం. రైతుబజారులో ధరల పట్టిక నుంచి టాయిలెట్స్, పార్కింగ్, పరిశుభ్రతపై నిత్యం పర్యవేక్షణ ఉంటుంది.

–సీహెచ్ కృష్ణమూర్తి, ఎస్టేట్ అధికారి, కంచరపాలెం రైతుబజార్

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన చిన్న బుచ్చిరాజుపాలెం రెడ్డివీధి వాసులతో బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బాజీ జంక్షన్ దరి చిన్నబుచ్చిరాజుపాలెం రెడ్డి వీధికి చెందిన పలువురు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి 30 కుటుంబాల వారు పార్టీలో చేరారని తెలిపారు. పార్టీపై, ముఖ్యమంత్రిపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరామని వారంతా స్పష్టం చేశారు. వీరిలో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ద్వారా ప్రయోజనం పొందినవారు కూడా ఉన్నారని.. అందుకే స్వచ్ఛందంగా తమ వద్దకు వచ్చారని తెలిపారు. పార్టీలో చేరిన కొందరు మాట్లాడుతూ ఇటీవల తమ ప్రాంత సమస్యలు చెప్పడానికి ఎమ్మెల్యే వద్దకు వెళితే బలవంతంగా టీడీపీ కండువాలు వేశారని తెలిపారు. ఇకపై తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్క పైడిరాజు రెడ్డి, దేరెడ్ల సత్యనారాయణ, తమ్మి రెడ్డి, చుక్క రమణ, యుక్క కొండమ్మ, చుక్క రజని, విజయ, వాస శ్యామల, శ్రీను, రాము, అప్పారావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం




శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జోన్-5లో గల 24 వార్డుల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. మంగళవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్ ఛార్జీల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, గెడ్డల్లో చెత్తా చెదారాలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. క్లాప్ వాహనాల టైం విధిగా నమోదు చేయాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలకు సూచించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణలో పారిశుధ్య సిబ్బందిపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతివారం రివ్యూ సమావేశాలు నిర్వహిస్తామని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని జెడ్సీ హెచ్చరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ఎకో వైజాగ్‌లో జోన్ ముందంజలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునిల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దనరావు, ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, జోన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో మూఢ నమ్మకాలకు అడ్డుకట్ట



జేవీవీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా



పాల్గొన్న ప్లస్-2 విద్యార్థులు

గోపాలపట్నం: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ హెప్సిబా అన్నారు. గోపాలపట్నం బాలికల ప్లస్-2 ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ (ఏఐపీఎస్ఎన్), భారత్ జ్ఞాన్ విజ్ఞాన్ పరిషత్ సంయుక్తంగా శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూఢ నమ్మకాల వల్ల జీవితాలు నాశనం అవుతాయని, వాటిని విడనాడాలన్నారు. దీనిపై విజయం సాధించాలంటే హేతువాదంతో ఆలోచన చేయాలన్నారు. విశాఖ జిల్లా జన విజ్ఞాన వేదిక కార్యదర్శి కె. శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీకాంత్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నుంచి డాక్టర్ సర్ సీవీరామన్ నోబుల్ బహుమతి పొందిన తేదీ ఫిబ్రవరి 28 వరకు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో చెకుముకి సైన్సు ప్రోత్సాహక పరీక్షలు, అవగాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, సైన్స్ ఫర్ సెక్యులరిజం, డెమొక్రసి అన్న నినాదంతో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీ నాయకులు పి. రాధారాణి, కోశాధికారి ఎస్‌వి రమణ, ఉపాధ్యాయులు కె. ప్రసాద్, ఎం. రమణ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం: దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌లో రైల్వే అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టారు. రైళ్లలో దీపావళి సామగ్రి, మండే స్వభావం గల పదార్థాలు తరలించకూడదని విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగాలో రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించింది. డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో టపాసులు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

క్లుప్తంగా

సకాలంలో సిలబస్ పూర్తి

ఎంఈవో-1 సోమేశ్వరరావు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-1 సోమేశ్వరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో-1 ఎ. సోమేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నారో పరిశీలించారు. వారి చేత పాఠ్యాంశాలను చదివించారు. పిల్ల చేత గణితం, ఇంగ్లిష్ వంటి పలు అంశాలను రాయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, వర్క్ బుక్కులు తప్పని సరిగా పరిశీలించి దిద్దుబాటు చేయాలన్నారు. విద్యార్థులు యూనిఫారం, బూట్లు ధరించాలని సూచించారు. జేవీకే బ్యాగ్‌తో స్కూల్‌కు రావాలన్నారు. మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. నాడు- నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం



సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సిన్హాకు కేక్ తినిపిస్తున్న అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ సాధించిందని వివరించారు. రానున్న సంవత్సరంలో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ వివిధ రంగాల్లో సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్.గోవిందరాజన్, అంజూ సిన్హా, హెచ్‌ఆర్ హెడ్ రుమా డీ శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళలకు ఆశ్రయం



ఆశ్రయం పొందిన మహిళలతో ప్రగడ వాసు తదితరులు

అల్లిపురం : నగరంలో వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా తిరుగుతున్న మహిళలకు ఏయూటీడీ సిబ్బంది కల్పించారు. అటువంటి వారికి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల మహిళల షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అదిలాబాద్‌కు చెందిన పూజ (55), ఒడిశాకు చెందిన శాంతి (25), పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫాతిమాను రైల్వేస్టేషన్, కంచరపాలెం, కేజీహెచ్ దగ్గర గుర్తించి పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో ఆశ్రయం కల్పించామన్నారు. వారిని పూణే కేంద్రంగా పని చేస్తున్న శ్రద్ధా ఫౌండేషన్‌కు అప్పగించినట్లు వాసు తెలిపారు. త్వరలోనే వారిని వాళ్ల కుటుంబాలకు అప్పగించనున్నట్లు శ్రద్ధా ప్రతినిధి రమాకాంత్ తెలిపారు.

పరిశ్రమలు పార్కింగ్ స్థలం కేటాయించాలి



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో గల కంపెనీలు పార్కింగ్ కోసం స్థలాలు కేటాయిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ అన్నారు. ఇక్కడ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై మల్కాపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అధికారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కాన్వెంట్ జంక్షన్ నుండి మారుతి జంక్షన్, మారుతి సర్కిల్ జంక్షన్, వీడీఆర్ జంక్షన్లను కలుపుతూ సింధియా మీదుగా శ్రీహరిపురం వరకు గల రహదారులను విస్తరిస్తే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ఇక్కడ గల పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలకు ఆయా కంపెనీలు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయిస్తే ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చన్నారు. అలాగే బస్ సెల్టర్ల ఏర్పాటుకు పరిశ్రమలు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు టిక్కెట్ సర్వీస్ కోసం తమ ఆటోలను రోడ్డు మధ్యలో ఆపడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఆటో డ్రైవర్లు తమ తీరు మార్చుకోవాలని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ సూచించారు. ఈ సదస్సులో ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ మోసిస్‌పాల్, సీఐ జి.డి. బాబు, ట్రాఫిక్ సీఐ తులసీదాస్, ట్రాఫిక్ ఎస్ఐలు సుదర్శన్, భాస్కర్, రాజు తదితరులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్పొరేటర్లు, పరిశ్రమల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీని సందర్శించిన రాజారెడ్డి



కార్గో, పార్శిల్ పాయింట్‌ను సందర్శించి సూచనలిస్తున్న రాజారెడ్డి

డాబాగార్డెన్స్: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎ. రాజారెడ్డి, జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రవికుమార్ మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీని సందర్శించారు. పార్శిల్ పాయింట్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డోర్ డెలివరీపై ఆరా తీశారు. ముఖ్యంగా డోర్ డెలివరీని అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం ప్రజా రవాణా అధికారి అప్పలరాజు చాంబర్లో పలువురు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఏపీఎస్ఆర్‌టీసీ ఉన్నతకి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ఎ. అప్పలరాజు, డీసీటీఎంలు బి. అప్పలనాయుడు, సత్యనారాయణ, ఏటీఎం కణితి వెంకట్రావు, డిపో మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల రేటు తగ్గుదలకు కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు. చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మహారాణిపేట: మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై అందరిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. మాతాశిశు మరణాలను తగ్గించడానికి ప్రతి ఏడాది నవంబర్ 7న శిశు సంరక్షణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. నవజాత శిశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించి శిశు మరణాల రేటు తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ మాట్లాడుతూ గైనిక్ విభాగంలో లేబర్ రూమ్‌లో బయో మెడికల్ వేస్ట్ గురించి ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ చిన్నారులకు వచ్చే వ్యాధులను తల్లి గుర్తించి వైద్యం చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ షర్మిల, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటేశ్వరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ పిల్లల డాక్టర్ పి.చక్రవర్తి, డాక్టర్ శరణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.మనోరమ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో శిక్షణ శిబిరం

రేపటి నుంచి చిత్తూరులో రాష్ట్ర స్థాయి పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గోనున్న ఖోఖో జట్లతో కోచింగ్ క్యాంప్ నిర్వాహకులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనున్న జట్లకు శిక్షణ శిబిరం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అండర్-14 (బాలురు, బాలికల) జట్లకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు కోచింగ్ క్యాంప్ నిర్వహించి, ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు పర్యవేక్షణలో పీడీలు లక్ష్మీరాణి, శ్యామ్, వీరు నాయుడు ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు వారం రోజుల పాటు సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ పొంది, ఆటలో మెలకువలు నేర్చుకుని, ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధులు కావడం సంతోషంగా ఉందన్నారు. పోటీలో సత్తా చాటి ఉమ్మడి విశాఖ జిల్లాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రజల సంపద

- సంస్థను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం దారుణం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద మానవహారం



స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు మెయిన్ గేటు వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మానవహారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు మద్దతు ఇస్తున్న మోదీ వైఖరిని పోరాట కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఉక్కు దీక్షలు 1000 రోజులకు చేరుకుంటున్న సందర్భంగా బుధవారం ఉదయం కూర్మన్నపాలెం కూడలిలో జరిగే దీక్షలో కుటుంబాలు వేలాదిగా పాల్గోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, బీఎంకె నాయక్, జె.రామకృష్ణ, వై.టి.దాస్, డి.అప్పారావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, రామ్మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

9న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 9న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.